## గడ్డం రంజిత్ రెడ్డిని గెలుపించుకుందాం

బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



రుద్రారం గ్రామంలోని సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

ధారూరు, జనవరి 13 : చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ని భారీ మెజార్టీతో గెలుపించుకుందామని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని గట్టేపల్లి, రుద్రారం గ్రామాల్లో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మాసంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓడినందుకు నిరాశ చెందొద్దన్నారు. ప్రతి ఒక్కరూ రంజిత్ అన్న గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ధారూరు మండల నాయకులు భీంసేన్ చారి, వెంకటయ్య, బిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాంరెడ్డిపల్లి గ్రామంలో కలకలం

**అనుమానాస్పద స్థితిలో పుర్రె, తల వెంకట్రుకలు గుర్తింపు**

- **పోలీసులకు సమాచారం అందించిన గ్రామస్తులు**
- **పుర్రె, తలవెంట్రుకలను దగ్గరలో ఉన్న తాళం చెవి ఆధారంగా దొండయెన్కెపల్లి గ్రామానికి చెందిన మహిళ దిగా గుర్తించిన పోలీసులు**
- **ఘటనా స్థలాన్ని పరిశీలించిన కులకచర్ల తహసీల్దార్ మురళీధర్, ఎస్ఐ శ్రీశైలం**

కులకచర్ల, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఉన్న పుర్రె, తల వెంట్రుకలు కనిపించడంతో మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో కలకలం రేగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో జన సంచారం లేని ప్రదేశంలో పుర్రె, తల వెంట్రుకలను చూసిన గ్రామస్తులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పుర్రె, తలవెంట్రుకలను పరిశీలించడంతో పాటు తాళం చెవి లభించగా దాని ఆధారంగా దొంగయెన్కెపల్లి గ్రామానికి చెందిన మహిళ అనంతమ్మగా గుర్తించారు. కాగా, ఈ విషయాన్ని ఆ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి ప్రాథమిక విచారణ నిర్వహించినట్లు కులకచర్ల ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. అనంతమ్మకు మతిస్థిమితం లేదు. కల్లు తాగే అలవాటు ఉన్నది. నాలుగు నెలల క్రితం ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. తాగిన మత్తులో మృతి చెంది ఉండవచ్చునని, వర్షాలు ఎక్కువగా కురువడం వల్ల మృతదేహం కళ్లిపోయిందని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్..

పుర్రె, వెంట్రుకలు లభించిన స్థలాన్ని కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ ఎస్ఐ శ్రీశైలంతో కలిసి పరిశీలించారు. గ్రామ సమీపంలోని చెట్ల పొదల మధ్య ఉన్న పుర్రె, వెంట్రుకలను పరిశీలించారు. దోమ మండలం దొంగయెన్కెపల్లి గ్రామానికి చెందిన అనంతమ్మగా గుర్తించినట్లు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్, ఎస్ఐ శ్రీశైలం

శంషాబాద్ వద్ద కల్వర్టులో పడిపోయిన వాహనాలు



# పండుగ పూట.. విషాదం

*సంక్రాంతి పండుగ వేళ.. పలు కుటుంబాల్లో విషాదం నెలకొంది. గ్రేటర్‌లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడగా, పతంగి సరదా ఓ బాలుడి ప్రాణం తీసింది. అలాగే జోగులాంబ గద్వాల జిల్లా వద్ద ప్రైవేటు బస్సు బోల్తాపడి.. మంటలంటుకొని నగరానికి చెందిన ఓ మహిళ సజీవదహనమయ్యారు.*

- అత్తాపూర్‌లో పతంగి ఎగురవేస్తూ.. కరెంట్ షాక్‌తో బాలుడి దుర్మరణం
- తల్లికొడుకుల ప్రాణం తీసిన అతివేగం.. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఢీకొన్న కారు..బైకు..ఆటో
- మల్లంపేటలో బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్ యువకుడి మృతి



### బైక్‌పై వెళ్తుండగా

దుండిగల్, జనవరి 13: దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేట్‌కు చెందిన ముకేశ్(21) శుక్రవారం రాత్రి బైక్‌పై బాచుపల్లి వైపు వస్తుండగా మల్లంపేట్ కమాన్ వద్ద ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీ కొట్టింది. ప్రమాదంలో ముకేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### జోగులాంబ గద్వాల్ వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. నగరవాసి సజీవదహనం

### వేగంగా వచ్చి.. అదుపు తప్పి..

శంషాబాద్ రూరల్, జనవరి 13 :హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టగా, ఆ ద్విచక్రవాహనం ముందు వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో మూడు వాహనాలు రోడ్డు పక్కన నిర్మాణంలో ఉన్న కల్వర్టు గుంతలో పడిపోయాయి. ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఘాన్సీమియాగూడ గ్రామ సమీపంలో ఈ విషాద చోటు చేసుకున్నది. శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త ఈసీఐఎల్‌లో ఉంటున్న మేరువ ఆదిశేషరెడ్డి(57) ఆయన తల్లి రాములమ్మ(88) చనిపోయారు. సంక్రాంతి పండుగ కోసం వీరు నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామానికి వెళ్తుండగా, ప్రమాదానికి గురై మృత్యువాతపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ నారాయణపేట్‌కు చెందిన అంజి, చిన్నారి అక్షిత, ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న కార్మికులు రియాజ్, ఫారుఖ్‌కు గాయాలయ్యాయి. కాగా, రోడ్డు ప్రమాదంతో దాదాపు నాలుగు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అవ్వగా, పోలీసులు క్లియర్ చేశారు.

## 36 ప్రాజెక్టులు.. ₹4305 కోట్లు

**ఎస్ఆర్‌డీపీ-2కు నిధులివ్వండి**

**సర్కారుకు జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు**

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : రెండో దశ వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్ఆర్‌డీపీ)పై బల్దియా దృష్టి సారించింది. తొలి విడత 47 పనుల్లో రూ. 3248.53 కోట్లు వెచ్చించి.. 36 ప్రాజెక్టులు అందుబాటులోకి తెచ్చారు. ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 11 చోట్ల పనులు తుది దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రెండో దశలో ఎక్కువగా ఆర్‌యూబీ, ఆర్వోబీలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ మేరకు రూ. 4305 కోట్ల వ్యయంతో 36 చోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి.. నిధుల కేటాయింపుపై ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ నివేదిక అందజేసింది. ప్రత్యేక గ్రాంటు లేదా రుణాల గ్యారెంటీపై సర్కారు నుంచి అనుమతి వస్తుందని అధికారులు చెబుతున్నారు. త్వరలో జీహెచ్ఎంసీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష ఉంటుందని, ఇందులో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

## బోల్తాపడి.. మంటలంటుకొని..

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): జోగులాంబ గద్వాల జిల్లా వద్ద ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడి.. మంటలంటుకొని నగరానికి చెందిన ఓ మహిళ సజీవ దహనమయ్యారు. సంక్రాంతి నేపథ్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముండే పలువురు సొంతూళ్లకు వెళ్లేందుకు జగన్ ట్రావెల్స్‌లో టికెట్లను బక్ చేసుకుని శనివారం రాత్రి చిత్తూరుకు బయలుదేరారు. అయితే జోగులాంబ గద్వాల జిల్లా వద్దకు చేరుకోగానే తెల్లవారుజాము సుమారు 3 గంటల సమయంలో బస్సు పల్టీకొట్టి బోల్తాపడింది. బస్సుకు మంటలు అంటుకోవడంతో నగరానికి చెందిన మాలతి సజీవ దహనమయ్యారు. మరో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో నగరంలో విషాదచాయలు అలముకున్నాయి.

## చిన్నారిని మింగిన సంక్రాంతి పతంగి

బండ్లగూడ, జనవరి 13 : స్నేహితులతో కలిసి గాలిపటం ఎగరేస్తూ.. ఓ బాలుడు విద్యుదాఘాతంతో చనిపోయాడు. ఈ విషాద ఘటన అత్తాపూర్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీవాణి అపార్ట్‌మెంట్‌లో నివాసముండే అభిషేక్ అన్న కొడుకు తనిష్క్ ఇక్కడే ఉంటూ చదువుకుంటున్నాడు. శనివారం తనిష్క్ స్నేహితులతో కలిసి అపార్ట్‌మెంట్ భవనంపై పతంగులు ఎగురవేసేందుకు వెళ్లాడు. అక్కడ ఏసీ యంత్రం తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తనిష్క్

## దీర్ఘకాలిక లీజుకు మెట్రో మాల్స్

ఒప్పందానికి సిద్ధమైన నెక్సస్ మాల్ ట్రస్ట్

- లీజు ఒప్పందం విలువ రూ.2500 కోట్లపైనే..
- 3 మాల్స్‌లోని 9 లక్షల చదరపు అడుగులు
- లీజుకు ఇవ్వనున్న ఎల్‌అండ్‌టీ మెట్రో



సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాలు ( మెట్రోమాల్స్) దీర్ఘ కాలిక లీజుకు ఇచ్చేందుకు ఎల్ అండ్ టీ సంస్థ ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు మొదలు పెట్టింది. నగరంలో మూడు చోట్ల ఉన్న మాల్స్‌ను లీజుకు ఇవ్వడం ద్వారా ఒకేసారి రూ.2500 నుంచి 3వేల కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో 69 కి.మీ మార్గాన్ని 3 కారిడార్‌లలో నిర్మించింది ఎల్ అండ్ టీ సంస్థ. అదే సమయంలో కారిడార్–1(మియాపూర్–ఎల్‌బీనగర్)లో పంజాగుట్ట, ఎర్రమంజిల్, మూసారంబాగ్ ప్రాంతాల్లో 3 మెట్రో మాల్స్‌ను నిర్మించగా, కారిడార్–3 (నాగోల్–రాయదుర్గం)లో హైటెక్ సిటీ వద్ద ఒక మాల్‌ను నిర్మించింది. మొత్తం 4 మాల్స్ ఉండగా, వాటి మొత్తం విస్తీర్ణం 12 లక్షల చదరపు అడుగుల వరకు ఉంది. ఇప్పటి వరకు ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ హైదరాబాద్ నెక్స్ట్‌గలేరియా మాల్స్ పేరుతో నిర్వహిస్తోంది. తాజాగా 3 మెట్రో మాల్స్‌ను దీర్ఘ కాలిక లీజు కింద అప్పగించేందుకు నెక్సస్ సెలెక్ట్ ట్రస్టుతో సంప్రదింపులు జరుపుతోంది. 3 చోట్ల ఉన్న మెట్రో మాల్స్ విస్తీర్ణం మొత్తం సుమారు 9 లక్షల చదరపు అడుగులు ఉండగా, పంజాగుట్ట మాల్ విస్తీర్ణం 5 లక్షల చదరపు అడుగులు, హైటెక్ సిటీలోని ఇ-గెలిరియా మాల్ విస్తీర్ణం 2 లక్షలు, ఎర్ర మంజిల్‌లోని ప్రీమియా మాల్ విస్తీర్ణం మరో 2 లక్షల వరకు ఉంటుంది. వీటిలో ఇప్పటి వరకు 84 శాతం స్థలాన్ని వివిధ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందుతోంది. కాగా అన్ని మాల్స్‌ను ఒకేసారి దీర్ఘ కాలిక లీజుకు ఇవ్వడం ద్వారా పెద్ద మొత్తంలో నిధులను సమకూర్చుకునేందుకు ఎల్ అండ్ టీ సిద్ధమైనట్లు తెలిసింది. కాగా, దీనిపై హైదరాబాద్ మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు మాత్రం స్పందించలేదు.

### రాయదుర్గంలో మెట్రో స్థలం లీజుకు..

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా ఎల్ అండ్ టీ మెట్రో సంస్థకు ప్రభుత్వం రాయదుర్గంలోని మైండ్ స్పేస్ జంక్షన్ సమీపంలో 15 ఎకరాలను కేటాయించింది. అందులో ఇప్పటికే రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్‌మెంట్–టీఓడీ)లో భాగంగా బిజినెస్ పార్కు టవర్ 1ను నిర్మించారు. మిగతా ఖాళీ స్థలాన్ని మొత్తంగా ఇతర సంస్థలకు గతేడాది దీర్ఘకాలిక లీజుకు ఇచ్చింది. దీని ద్వారా సుమారు రూ.1200 కోట్ల ఒకేసారి సమకూర్చుకున్నట్లు సమాచారం.



శంకర్‌పల్లిలో రంగులను కొనుగోలు చేస్తున్న జనం

పుష్యమాసంలో సూర్యుడు ‘మకరరాశి’లో ప్రవేశించిన పుణ్యదినం. ‘సం’ అంటే మిక్కిలి, ‘క్రాంతి’ అంటే అభ్యుదయం.. అని అర్థం. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల జరుపుకొనే పెద్ద పండుగ. పంట చేతికొచ్చి రైతుల ఇంట సిరులు కురిసే సమయమిది. పల్లెలు ఆహ్లాదకరంగా, అందంగా అలరారు వేళ బుడబుక్కలవారు, పగటివేషధారులు, జానపద వినోద కళాకారులు పల్లెల్లో భిక్షాటన చేస్తూ సందడి చేస్తుంటారు. ఆడపడుచులు ఇండ్ల ఎదుట ముగ్గులు వేసి, ఆవుపేడతో గొబ్బెమ్మలను ఉంచి పూజలు చేస్తారు. ఏ ఇంట చూసినా అరిసెలు, చక్రాలు, సకినాలు తదితర పిండి వంటలు గుమగుమలాడుతుంటాయి. గంగిరెద్దుల వాళ్లు ఇంటింటికీ తిరుగుతూ ఎద్దులను నృత్యాలు చేయిస్తూ సందడి చేస్తుంటారు.

- ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నంరూరల్/ షాద్‌నగర్‌టౌన్/వికారాబాద్, జనవరి 13



ఇబ్రహీంపట్నంలో గంగిరెద్దు వారికి భిక్షం వేస్తున్న మహిళ

# సంబురాల సంక్రాంతి

- మూడ్రోజుల పాటు జరుపునే గొప్ప పండుగ
- నేడు భోగభాగ్యాల భోగి.. రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుము
- పట్టణాల నుంచి పల్లెలకు పయనమవుతున్న జనం
- ఏ ఇంట చూసినా బంధుమిత్రులతో ముచ్చట్లు

- ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సంక్రాంతి పండుగ సందడి
- గాలిపటాలు, రంగులు కొనుగోలు చేస్తున్న జనం

*ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో సంబురాల సంక్రాంతి సందడి నెలకొన్నది. పట్నం నుంచి పల్లెలకు బంధుమిత్రులు వస్తుండడంతో ఏ ఇంట చూసినా సందడే.. సందడి కనిపిస్తున్నది. శనివారం అధికంగా యువత గాలిపటాలు, రంగులను కొనుగోలు చేయడంతో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. కొత్తకొత్త ఆకారాలతో గాలిపటాలు మార్కెట్‌లోకి వచ్చాయి. పండుగ ముందే చిన్నారులు గాలిపటాలు ఎగరవేయడం, మహిళలు రంగు రంగుల ముగ్గులు వేస్తూ సంతోషంలో మునిగితేలుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందడి నెలకొన్నది.*



షాద్‌నగర్ పట్టణంలోని దుకాణంలో పతంగులను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు





వికారాబాద్‌లో గాలిపటాలను కొనుగోలు చేస్తున్న యువత



ఇబ్రహీంపట్నంలో ఇంటి ఎదుట ముగ్గులు వేస్తున్న యువతి



షాద్‌నగర్ పట్టణంలో..



ఇబ్రహీంపట్నంలో..